# నందినికి స్వర్ణం

**సత్తాచాటిన తెలంగాణ అథ్లెట్ • ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్**



గుమి(దక్షిణకొరియా): ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ల పతక ప్రదర్శన అద్భుతంగా కొనసాగుతున్నది. శుక్రవారం జరిగిన వేర్వేరు ఈవెంట్లలో తెలంగాణ యువ అథ్లెట్ అగసర నందినితో పాటు హైజంపర్ పూజాసింగ్, లాంగ్‌డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్‌సింగ్ పసిడి పతకాలతో మెరిశారు. దీంతో ఇప్పటి వరకు భారత్ ఖాతాలో 8 స్వర్ణాలు, 7 రజతాలు, మూడు కాంస్య పతకాలు చేరాయి. మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో నందిని 4500 పాయింట్లతో అగ్రస్థానంలో స్వర్ణ పతకాన్ని సగర్వంగా ముద్దాడింది. లుయి జుంగ్యీ(చైనా, 4210), కాయ్ జువాన్ చెన్(చైనీస్ తైపీ, 4193) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఏషియన్ అథ్లెటిక్స్ హెప్టాథ్లాన్‌లో స్వప్నా బర్మన్ (2017), సోమా బిశ్వాస్ (2005) తర్వాత స్వర్ణం గెలిచిన మూడో భారత అథ్లెట్‌గా నందిని అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఎస్సీ గురుకులంలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న నందిని అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా పతకాలు కొల్లగొడుతున్నది. పురుషుల 5000 మీటర్ల రేసును గుల్వీర్ 13:24:77సెకన్లలో పూర్తి చేసి పసిడి దక్కించుకున్నాడు. మహిళల హైజంప్‌లో పూజాసింగ్ 1.89మీటర్లతో స్వర్ణాన్ని ఒడిసిపట్టుకుంది.

# సెమీస్‌లో సాత్విక్ జోడీ


**వరల్డ్ నంబర్‌వన్ ద్వయంపై అద్భుత విజయం**



సింగపూర్: సింగపూర్ ఓపెన్‌లో భారత స్టార్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి టైటిల్‌కు రెండు అడుగుల దూరంలో నిలిచారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ 21-17, 21-15తో ప్రపంచ నంబర్‌వన్ జంట గోహ్ జీ ఫీ, నూర్ ఇజుద్దీన్‌పై అద్భుత విజయం సాధించింది. 39 నిమిషాల్లో ముగిసిన పోరులో సాత్విక్, చిరాగ్ ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. గాయం నుంచి కోలుకుని బరిలోకి దిగిన తొలి టోర్నీలోనే ఈ యువ షట్లర్ల పోరాట పటిమ ఆకట్టుకుంది. తొలి గేమ్ నుంచే తమదైన దూకుడు కనబరిచిన సాత్విక్, చిరాగ్ కండ్లు చెదిరే షాట్లతో పాయింట్లు దక్కించుకున్నారు. రెండో గేమ్‌లోనూ మలేషియా జోడీకి అవకాశమివ్వని మన ద్వయం చిరస్మరణీయ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. శనివారం జరిగే సెమీస్‌లో మూడో సీడ్ ఆరోన్ చియా, సోహ్ వుయిక్‌తో తలపడుతుంది.

# ఇంగ్లండ్ రికార్డు విజయం

• **చిత్తుగా ఓడిన వెస్టిండీస్**




బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్ క్రికెట్‌లో హ్యారీ బ్రూక్ కెప్టెన్సీ అరంగేట్రం అదిరిపోయింది. ఇంగ్లండ్ క్రికెట్‌కు కొత్త జోష్ తీసుకొస్తూ వెస్టిండీస్‌తో తొలి వన్డేలో పరుగుల వరద పారించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ 238 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తుగా ఓడించింది. తొలుత ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 400/8 భారీ స్కోరు సాధించింది. మొదటి ఏడుగురు బ్యాటర్లు 35 అంతకంటే పరుగులు నమోదు చేసి వన్డే క్రికెట్‌లో కొత్త రికార్డు నెలకొల్పారు. సొంతగడ్డపై తొలి మ్యాచ్ ఆడిన జాకబ్ బెతెల్(53 బంతుల్లో 82, 8ఫోర్లు, 5సిక్స్‌లు), డకెట్(48 బంతుల్లో 60, 6ఫోర్లు, సిక్స్), హ్యారీ బ్రూక్(58), రూట్(57) అర్ధసెంచరీలతో కదంతొక్కారు. పసలేని విండీస్ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ పరుగులు కొల్లగొట్టారు. భారీ లక్ష్యఛేదనకు దిగిన విండీస్ 26.2 ఓవర్లలో 162 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ షాయి హోప్(25) టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. సకీబ్ మహమూద్(3/32), ఓవర్టన్(3/22) ధాటికి విండీస్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఏ దశలోనూ ఇంగ్లండ్‌కు పోటీనివ్వలేకపోయింది. బెతెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.



## గుకేశ్ ఉత్కంఠ విజయం

స్టావెంజర్(నార్వే): నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ సత్తాచాటాడు. శుక్రవారం జరిగిన ఓపెన్ రౌండ్-4 హోరాహోరీ పోరులో గుకేశ్..అమెరికా జీఎం ఫాబియానో కరువనపై అద్భుత విజయం సాధించాడు. ఆఖరి వరకు నువ్వానేనా అన్నట్లు సాగిన పోరులో ఆర్మాగెడాన్ పద్ధతిలో గుకేశ్ విజయం సాధించాడు. గేమ్‌లో ఎక్కువ శాతం ఫాబియానో ఆధిపత్యం ప్రదర్శించినా విజయం సాధించడంలో విఫలమయ్యాడు. మరోవైపు ఇరిగేసి అర్జున్..నార్వే చెస్ దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్ చేతిలో ఓటమిపాలయ్యాడు. మహిళల విభాగంలో కోనేరు హంపి..వెన్‌జున్ చేతిలో ఓడగా, వైశాలి..అన్నా ముజుచుక్‌ను ఓడించి ముందంజ వేసింది.



## స్వియాటెక్ ముందంజ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టైటిల్ ఫేవరేట్లలో ఒకరైన ఇగా స్వియాటెక్ ముందంజ వేసింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో స్వియాటెక్ 6-2, 7-5తో జాక్వెలిన్న అడిన్‌పై అలవోక విజయం సాధించింది. మ్యాచ్‌లో ఆది నుంచే తనదైన ఆధిపత్యం ప్రదర్శించిన ఐదో సీడ్ స్వియాటెక్ వరుస సెట్లలో ప్రత్యర్థిని ఓడించింది. మిగతా మ్యాచ్‌ల్లో ప్రపంచ నంబర్‌వన్, బెలారస్ బ్యూటీ ఎరీనా సబలెంక నాలుగో రౌండ్‌లోకి ప్రవేశించింది. మూడో రౌండ్‌లో సబలెంక 6-2, 6-3తో ఓల్గా డానిలోవిచ్(సెర్బియా)పై గెలిచింది. జాంగ్ 6-3, 6-4తో విక్టోరియా బొకోపై, పొలిని 6-4, 6-1తో యులియాపై గెలిచి తదుపరి రౌండ్లలోకి ప్రవేశించారు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో యుకీ భాంబ్రీ-రాబర్ట్ ద్వయం 6-7(4), 7-6(7), 6-3తో నికోల మెక్టిక్, మైఖేల్ వీనస్ జోడీపై గెలిచి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

**ఎలిమినేటర్‌లో గుజరాత్‌పై అద్భుత విజయం**

# ముంబై మహాన్

**అర్ధసెంచరీతో రాణించిన రోహిత్‌శర్మ • సాయి సుదర్శన్ ఒంటరి పోరాటం వృథా**



రోహిత్ (81)

**మాజీ చాంపియన్ ముంబై ఇండియన్స్ సత్తాచాటింది. తాము మనసు పెట్టి ఆడితే ఎంతటి ప్రత్యర్థి అయినా బలాదూర్ అంటూ చేతల్లో చూపెట్టింది. కీలకమైన ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్‌ను మట్టికరిపిస్తూ ముంబై క్వాలిఫయర్-2లోకి దూసుకెళ్లింది. రోహిత్‌శర్మ ధనాధన్ అర్ధసెంచరీకి తోడు బెయిర్‌స్టో, సూర్యకుమార్ మెరుపులతో భారీ స్కోరు అందుకున్న ముంబై..గుజరాత్‌ను కట్టడి చేయడంలో సఫలమైంది. లక్ష్యఛేదనలో సాయి సుదర్శన్ సూపర్ అర్ధసెంచరీతో ఒంటరిపోరాటం చేసినా జట్టు గెలుపు తీరాలకు చేరలేకపోయింది. సమిష్టి బౌలింగ్‌తో గుజరాత్ నడ్డివిరుస్తూ ముంబై విజయకేతనం ఎగురవేసింది.**

ముల్లాన్‌పూర్: ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ ముందంజ వేయగా, గుజరాత్ టైటన్స్ తమ పోరాటాన్ని ముగించింది. శుక్రవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబై 20 పరుగుల తేడాతో గుజరాత్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. తొలుత రోహిత్‌శర్మ(50 బంతుల్లో 81, 9ఫోర్లు, 4సిక్స్‌లు) అర్ధసెంచరీతో కదంతొక్కగా, బెయిర్‌స్టో(47), సూర్యకుమార్(33), తిలక్‌శర్మ(25) రాణించడంతో ముంబై 20 ఓవర్లలో 228/5 స్కోరు చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ(2/53), సాయికిషోర్(2/42) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 208/6 స్కోరుకు పరిమితమైంది. సాయి సుదర్శన్(49 బంతుల్లో 80, 10ఫోర్లు, సిక్స్) ఒంటరిపోరాటం చేయగా, సుందర్(48) ఆకట్టుకున్నాడు. బౌల్ట్ (2/56) రెండు వికెట్లు తీయగా, బుమ్రా, గ్లీసన్, సాంట్నర్, అశ్వని ఒక్కో వికెట్ తీశారు.

**సుదర్శన్ పోరాడినా:**

నిర్దేశిత లక్ష్యఛేదనలో గుజరాత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(1)ను బౌల్ట్ తన తొలి ఓవర్‌లోనే వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. బౌల్ట్ స్వింగ్‌ను సరిగ్గా అర్థం చేసుకోని గిల్ తన ఔట్‌పై డీఆర్‌ఎస్‌కు వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన కుశాల్ మెండిస్(20)..సాయి సుదర్శన్‌కు చక్కని సహకారం అందించాడు. ముంబై బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ వీరిద్దరు స్కోరుబోర్డుకు కీలకపరుగులు జతచేయడంతో పవర్‌ప్లే ముగిసే సరికి గుజరాత్ 66 పరుగులు చేసింది. లీగ్‌లో సూపర్‌ఫామ్‌మీదున్న సుదర్శన్ ముంబైపై తన తఢాకా చూపెట్టాడు. ఏ బౌలర్‌ను విడిచిపెట్టని సుదర్శన్ మరోమారు అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. కుశాల్ ఔటైనా..సుందర్‌తో కలిసి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. వీరిద్దరు ముంబై బౌలర్లను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొంటూ లక్ష్యం వైపు సాఫీగా సాగారు. అయితే బౌలింగ్ మార్పుగా వచ్చిన బుమ్రా..సుందర్‌ను ఔట్ చేయడంతో మ్యాచ్ స్వరూపం మారిపోయింది. ఆ తర్వాత స్వీప్ షాట్ ఆడబోయిన సుదర్శన్ వికెట్ ఇచ్చుకోగా, రూథర్‌ఫర్డ్(24), తెవాటియా(16 నాటౌట్), షారుఖ్‌ఖాన్(13) స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోయారు. ఆఖరి ఓవర్‌లో గుజరాత్ విజయానికి 24 పరుగులు అవసరమైన స్థితిలో 3 పరుగులే చేసి ఓటమి వైపు నిలిచింది.

**రోహిత్ ధమాకా:**

గుజరాత్‌తో ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా టాస్ గెలిచిన వెంటనే బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించి బౌలింగ్‌తో కట్టుదిట్టం చేస్తామన్న ఉద్దేశంతో ముంబై ముందుకు సాగింది. కెప్టెన్ అంచనాలకు తగ్గట్టుగానే ఓపెనర్లు రోహిత్‌శర్మ, జానీ బెయిర్‌స్టో జట్టుకు మెరుగైన శుభారంభాన్ని అందించారు. గత కొన్ని మ్యాచ్‌ల నుంచి బౌలింగ్‌లో తీవ్రంగా తడబడుతున్న గుజరాత్..ముంబైతో పోరులోనే అదే ఒరవడి కొనసాగించింది. దీనికి తోడు పేలవ ఫీల్డింగ్‌తో ఆ జట్టు ఆదిలోనే మూల్యం చెల్లించుకుంది. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్‌లో 3 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రోహిత్ శర్మ కొట్టిన షాట్‌ను బౌండరీ వద్ద కొట్జె విడిచిపెట్టడంతో బతికిపోయాడు. సిరాజ్ వేసిన మరుసటి ఓవర్‌లోనూ రోహిత్‌కు లైఫ్ దక్కింది. 12 పరుగుల వద్ద రోహిత్ ఇచ్చిన క్యాచ్‌ను వికెట్‌కీపర్ కుశాల్ మెండిస్ విడిచిపెట్టడంతో ముంబై ఊపిరి పీల్చుకుంది. ప్రసిద్ధ్ 4వ ఓవర్‌లో బెయిర్‌స్టో మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లతో 26 పరుగులు పిండుకున్నాడు. రికల్టన్ స్థానంలో జట్టులోకి వచ్చిన బెయిర్‌స్టో తన విలువ చాటుకున్నాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన సాయికిషోర్‌ను రోహిత్ 6, 4, 6 కొట్టడంతో 14 పరుగులు వచ్చాయి. దీంతో ప్లేఆఫ్స్ ముగిసేసరికి ముంబై 79 పరుగులు చేసింది. సాయికిషోర్ 8వ ఓవర్‌లో షాట్ ఆడబోయిన బెయిర్‌స్టో..కొట్జె క్యాచ్‌తో తొలి వికెట్‌గా వెనుదిరగడంతో తొలి వికెట్‌కు 84 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్(33)..రోహిత్‌కు జత కలిశాడు. ఈ క్రమంలో రషీద్‌ఖాన్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో రోహిత్ ఐపీఎల్‌లో 7వేల పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. ఫోర్‌తో అర్ధసెంచరీ మార్ అందుకున్న రోహిత్ బౌండరీలతో ఆకట్టుకున్నాడు. 12వ ఓవర్‌లో సూర్యకుమార్ 25 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను మెండిస్ విడిచిపెట్టాడు. సాయికిషోర్ బౌలింగ్‌లో సూర్యకుమార్ ఔటైనా 14 ఓవర్లు ముగిసే సరికి ముంబై 150 పరుగుల మార్క్ అందుకుంది. ఈ జోరు చూస్తే ముంబైకు భారీ స్కోరు సాధ్యమనుకున్న తరుణంలో రోహిత్ ఔటయ్యాడు. తిలక్‌వర్మ(25) ఎక్కువసేపు క్రీజులో నిలదొక్కుకోలేకపోయాడు. 19వ ఓవర్‌లో 200 మార్క్ అందుకున్న ముంబైకి కొట్జె వేసిన 20వ ఓవర్‌లో హార్దిక్ మూడు సిక్స్‌లతో 228 స్కోరు చేరుకుంది.



సుదర్శన్ (80)

**5** ఒక ఎడిషన్‌లో 750కి పైగా పరుగులు చేసిన ఐదో బ్యాటర్‌గా సాయి సుదర్శన్(759) నిలిచాడు. కోహ్లీ(973), గిల్(890), బట్లర్(863), వార్నర్(848) ముందు వరుసలో ఉన్నారు.

**10** 2015 నుంచి ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో 12 మ్యాచ్‌లాడిన ముంబై 10 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది.

| క్వాలిఫయర్-2 | ఆదివారం 01-06-2025 |
|---|---|
| పంజాబ్ X ముంబై | వేదిక |
| రా.7.30 నుంచి | ముల్లాన్‌పూర్ |

### సంక్షిప్త స్కోర్లు

**ముంబై:** 20 ఓవర్లలో(రోహిత్ 81, బెయిర్‌స్టో 47, సాయికిషోర్ 2/42, ప్రసిద్ధ్ కృష్ణ 2/53), **గుజరాత్:** 20 ఓవర్లలో 208/6(సాయిసుదర్శన్ 80, సుందర్ 48, బౌల్ట్ 2/56, సాంట్నర్ 1/10)

# 2014 - 2023 చిత్రాలకు గద్దర్ అవార్డులు

2024వ సంవత్సరానికిగాను ఉత్తమ ప్రతిభ కనబరచిన సినీ కళాకారులను గౌరవిస్తూ గద్దర్ ఫిల్మ్ అవార్డులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2014 నుంచి 2023 వరకు విడుదలైన సినిమాల్లోని ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి శుక్రవారం అవార్డులను ప్రకటించారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్‌రాజు ఆధ్వర్యంలో, జ్యూరీ చైర్మన్ మురళీమోహన్ అవార్డుల వివరాలను వెల్లడించారు. ఏడాదికి మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి అవార్డులు ప్రకటించామని, 2014 జూన్ 2 నుంచి సెన్సార్ అయిన సినిమాలను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నామని జ్యూరీ చైర్మన్ మురళీమోహన్ తెలియజేశారు.



సినీరంగానికి ఉత్తమ సేవలు అందించిన వారికోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆరు ప్రతిష్టాత్మక పురస్కారాలను కూడా వీటితోపాటే ప్రకటించారు. వాటి వివరాల్లోకెళ్తే.. 'ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు'కు ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణను, 'పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు'కు ప్రఖ్యాత దర్శకుడు మణిరత్నంను, 'బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు'కు దర్శకుడు సుకుమార్‌ను, 'నాగిరెడ్డి - చక్రపాణి ఫిల్మ్ అవార్డు'కు నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావును, 'కాంతారావు ఫిల్మ్ అవార్డు'కు హీరో విజయ్ దేవరకొండను, 'రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు'కు యండమూరి వీరేంద్రనాథ్‌ను జ్యూరీ ఎంపిక చేశారు. అలాగే.. ప్రజాకవి, దివంగత కాళోజీకి స్పెషల్ జ్యూరీ అవార్డును ప్రకటించారు. జూన్ 14న హైదరాబాద్‌లో జరిగే వేడుకలో ఈ అవార్డుల ప్రదానం జరుగుతుంది.

### సంవత్సరాల వారీగా ఉత్తమ చిత్రాల వివరాలు

**2014**
ప్రథమ ఉత్తమ చిత్రం : రన్ రాజా రన్
ద్వితీయ ఉత్తమ చిత్రం : పాఠశాల
తృతీయ ఉత్తమ చిత్రం : అల్లుడు శీను

**2015**
ప్రథమ ఉత్తమ చిత్రం : రుద్రమదేవి
ద్వితీయ ఉత్తమ చిత్రం : కంచె
తృతీయ ఉత్తమ చిత్రం : శ్రీమంతుడు

**2016**
ప్రథమ ఉత్తమ చిత్రం: శతమానం భవతి
ద్వితీయ ఉత్తమ చిత్రం: పెళ్లి చూపులు
తృతీయ ఉత్తమ చిత్రం: జనతా గ్యారేజ్

**2017**
ప్రథమ ఉత్తమ చిత్రం: బాహుబలి 2
ద్వితీయ ఉత్తమ చిత్రం: ఫిదా
తృతీయ ఉత్తమ చిత్రం: ఘాజీ

**2018**
ప్రథమ ఉత్తమ చిత్రం : మహానటి
ద్వితీయ ఉత్తమ చిత్రం: రంగస్థలం
తృతీయ ఉత్తమ చిత్రం: కేరాఫ్ కంచరపాలెం

**2019**
ప్రథమ ఉత్తమ చిత్రం: మహర్షి
ద్వితీయ ఉత్తమ చిత్రం: జెర్సీ
తృతీయ ఉత్తమ చిత్రం: మల్లేశం

**2020**
ప్రథమ ఉత్తమ చిత్రం: అల వైకుంఠపురములో..
ద్వితీయ ఉత్తమ చిత్రం: కలర్ ఫొటో
తృతీయ ఉత్తమ చిత్రం: మిడిల్ క్లాస్ మెలొడీస్

**2021**
ప్రథమ ఉత్తమ చిత్రం: ఆర్ ఆర్ ఆర్
ద్వితీయ ఉత్తమ చిత్రం: అఖండ
తృతీయ ఉత్తమ చిత్రం: ఉప్పెన

**2022**
ప్రథమ ఉత్తమ చిత్రం: సీతారామం
ద్వితీయ ఉత్తమ చిత్రం: కార్తికేయ 2
తృతీయ ఉత్తమ చిత్రం: మేజర్

**2023**
ప్రథమ ఉత్తమ చిత్రం: బలగం
ద్వితీయ ఉత్తమ చిత్రం: హనుమాన్
తృతీయ ఉత్తమ చిత్రం: భగవంత్ కేసరి

**చిత్రం**



# కూలీకి 150కోట్లు?

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్‌పై వయసు కూడా ప్రభావం చూపించలేకపోతున్నది. ఏడు పదులు దాటినా తలైవా ఇమేజ్ మాత్రం అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ఆయన సినిమా విజయం సాధిస్తే ఆ ప్రభావం ఎలా ఉంటుందో 'జైలర్' సినిమాతో నిరూపణ అయ్యింది. 220కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఆ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 650కోట్లు వసూలు చేసి, రజనీకాంత్ స్టామినా ఏంటో తెలియజెప్పింది. ప్రస్తుతం 'కూలీ' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు రజనీ. ఆగస్ట్ 15న విడుదల కానున్న ఈ సినిమాకోసం కోట్లాదిమంది తలైవా అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఇదిలావుంటే.. 'కూలీ' సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన వార్త కోలీవుడ్ సర్కిల్స్‌లో బలంగా వినిపిస్తున్నది. ఈ సినిమాలో నటించినందుకు గాను 150కోట్ల పారితోషికాన్ని రజనీకాంత్ అందుకున్నారనేది ఆ వార్త సారాంశం. ఇదే గనుక నిజమైతే.. ఇండియాలోనే రికార్డుగా నిలుస్తుందని అంటున్నారు. భాగస్వామ్యం, పర్సంటేజ్ విధానాలతో ప్రమేయం లేకుండా, కేవలం పారితోషికంగా మాత్రమే 150కోట్లు తీసుకోవడం దేశంలోనే రికార్డట. నిజానికి ఈ సినిమా బడ్జెట్ 375 కోట్లని తెలుస్తున్నది. అందులో రజనీ 150కోట్లు, లోకేష్ కనకరాజ్ 50కోట్లు పారితోషికాలను అందుకోగా, ఇతర పారితోషికాలు, సినిమా మేకింగ్‌కి మిగిలిన 275కోట్లు ఖర్చుపెడతారన్నమాట. మరో విషయం ఏంటంటే.. ఇప్పటికే ఈ సినిమాకు 240కోట్ల ప్రీరిలీజ్ బిజినెస్ జరిగిపోయింది. ఇంకా జరగాల్సిన బిజినెస్ చాలా ఉంది. మొత్తం మీద సినిమా నిర్మాత కళానిధి మారన్ ఇప్పటికే సేఫ్ జోన్‌లోకి వచ్చేశారన్నమాట. మరి తలైవానా మజాకా!

# 'థగ్‌లైఫ్'పై కర్ణాటకలో నిషేధం



## క్షమాపణకు కమల్ ససేమిరా

అగ్ర నటుడు కమల్‌హాసన్ తాజా చిత్రం 'థగ్ లైఫ్' ప్రదర్శనను నిషేధిస్తున్నట్లు ది కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన 'థగ్‌లైఫ్' ఈవెంట్‌లో తమిళ భాష నుంచే కన్నడం పుట్టిందని కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. కర్ణాటక రక్షణ వేదికతో పాటు పలు ప్రజా సంఘాలు కమల్ హాసన్ వ్యాఖ్యలపై భగ్గుమన్నాయి. ఈ నెల 30లోగా కమల్‌హాసన్ క్షమాపణలు చెప్పకపోతే 'థగ్‌లైఫ్'ను బహిష్కరిస్తామని కర్ణాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అల్టిమేటం జారీచేసింది. తాము విధించిన డెడ్‌లైన్ ముగిసినా కమల్‌హాసన్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో 'థగ్‌లైఫ్' చిత్రాన్ని బ్యాన్ చేస్తున్నట్లు ఫిల్మ్ ఛాంబర్ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ వివాదంపై క్షమాపణ చెప్పడానికి కమల్‌హాసన్ నిరాకరించారు. తప్పు చేస్తేనే తాను క్షమాపణలు చెబుతానని తాజా ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. 'గతంలో కూడా నా మీద ఇలాంటి బెదిరింపులు చాలానే వచ్చాయి. తప్పుచేయని పక్షంలో నేను అస్సలు క్షమాపణలు చెప్పను. ఇది నా జీవన విధానం. నేను ప్రజాస్వామ్యాన్ని, దేశాన్ని, చట్టాన్ని నమ్ముతాను' అని కమల్‌హాసన్ స్పష్టం చేశారు. మణిరత్నం డైరెక్ట్ చేసిన 'థగ్‌లైఫ్' జూన్ 5న విడుదలకానుంది.



# లైక్ తెచ్చిన తంటా

సోషల్‌మీడియా పోస్ట్‌లకు సెలబ్రిటీలు కొట్టే లైక్‌లు కూడా వారికి చిక్కులు తెచ్చిపెడుతున్న ఉదంతాలు ఇటీవల ఎక్కువవుతున్నాయి. వర్ధమాన బాలీవుడ్ నటి అన్వీత్‌కౌర్ వీడియోకు భారత స్టార్ బ్యాటర్ విరాట్‌కోహ్లి లైక్ కొట్టడం సోషల్‌మీడియాలో హాట్‌టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. తాజాగా బాలీవుడ్ నాయిక జాన్వీకపూర్ ఓ పోస్ట్‌కు కొట్టిన లైక్ ఆమెను ఇబ్బందుల్లో పడేసింది. వివరాల్లోకి వెళితే.. బాలీవుడ్ అగ్ర కథానాయికలు శ్రీదేవి, మాధురిదీక్షిత్‌లు నటించిన 'బేటా' 'ఖుదా గవా' చిత్రాలు 1992లో విడుదలయ్యాయి. 'బేటా' చిత్రానికి మాధురిదీక్షిత్ ఫిల్మ్‌ఫేర్ అవార్డు దక్కించుకుంది. 'ఖుదా గవా'లో శ్రీదేవి డ్యూయల్ రోల్‌లో అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరచినప్పటికీ ఆమెకు ఎలాంటి అవార్డు రాలేదు. ఇదే విషయంపై ఓ ఇన్‌స్టాగ్రామ్ యూజర్ రీల్‌ను రూపొందించాడు. రెండు సినిమాలకు సంబంధించిన వీడియోను పొందుపరచిన అతను...'బేటా' సినిమాలో మాధురి దీక్షిత్ చేసిన 'ధక్ ధక్ కర్‌నే లగా..' పాటను ఉదహరిస్తూ 'ఇలాంటి వల్గర్ డ్యాన్స్ చేసినందుకేనా మాధురీకి ఫిల్మ్ ఫేర్ దక్కింది' అని ప్రశ్నించాడు. 'ఖుదా గవా' చిత్రాన్ని శ్రీదేవి తన భుజస్కంధాలపై మోసిందని, అయినా ఆమె ప్రతిభను గుర్తించలేదని వాపోయాడు. ఈ రీల్‌కు జాన్వీకపూర్ లైక్ కొట్టడంతో అది కాస్త సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. అమ్మపై ప్రేమ ఉండటం సహజమే కానీ.. మాధురిదీక్షిత్ వంటి సీనియర్ నటిపై అయిష్టం ఎందుకంటూ కొందరు నెటిజన్లు కామెంట్స్ చేశారు. దీంతో వెంటనే ఆ లైక్‌ను తీసివేసింది జాన్వీకపూర్.



# సూర్య డ్యూయల్ రోల్?

తమిళ స్టార్ హీరో సూర్యకు ద్విపాత్రాభినయం కొత్తేమి కాదు. ఇప్పటికే ఆయన పలు చిత్రాల్లో డ్యూయల్ రోల్స్‌లో మెప్పించారు. తాజాగా ఆయన మరోమారు ద్విపాత్రాభినయంలో కనిపించబోతున్నారని తెలిసింది. వివరాల్లోకి వెళితే.. సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ భారీ పాన్ ఇండియా చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల లాంఛనంగా ప్రారంభోత్సవం జరుపుకుంది. ఈ సినిమా అప్‌డేట్స్ కోసం సూర్య అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో సూర్య డ్యూయల్ రోల్‌లో కనిపిస్తారట. ఈ రెండు పాత్రలు భిన్న కోణాల్లో సాగుతాయని, ఓ క్యారెక్టర్ నెగెటివ్‌గా ఉంటుందని చెబుతున్నారు. రాబరీ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారని సమాచారం.

# చర్యకు ప్రతిచర్య తప్పదు

వరలక్ష్మీ శరత్‌కుమార్ పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్న హారర్ థ్రిల్లర్ 'పోలీస్ కంప్లెయింట్'. సంజీవ్ మేగోటి దర్శకుడు. సింగపూర్ బాలకృష్ణ, మల్లెల ప్రభాకర్ నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉంది. ఈ సినిమాలో సూపర్‌స్టార్ కృష్ణ మీద స్పెషల్ సాంగ్ షూట్ చేశామని ఈ పాట సినిమాకు మెయిన్ హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. సూపర్‌స్టార్ కృష్ణ జన్మదినం సందర్భంగా నేడు వరలక్ష్మీ శరత్‌కుమార్ ఫస్ట్‌లుక్‌ని లాంచ్ చేశామని, మనం చేసే చర్యకు ప్రతి చర్య కచ్చితంగా ఉంటుందనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తెరకెక్కుతున్నదని, హారర్, థ్రిల్లర్ బ్యాక్‌డ్రాప్‌లో ఇదొక వినూత్న ప్రయత్నమని మేకర్స్ తెలిపారు. నవీన్‌చంద్ర, కృష్ణసాయి, రాగిణి ద్వివేది, రవిశంకర్, ఆదిత్య ఓం తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎస్.ఎన్.హరీష్, సంగీతం: ఆరోహణ సుధీంద్ర, సుధాకర్ మారియో, సంజీవ్ మేగోటి.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.